# 4

# కడుపు తీపి

రాత్రి పదిగంటలు దాటింది. ఆశ్రమ మంతా నిశ్శబ్దంగా ఉంది. ఆనందస్వామి కుర్చీలో అటూ ఇటూ కదిలాడు. ఆలోచనలు ప్రవాహంగా సాగారి పోతున్నాయి. అల్లంత దూరంలో శకుంతల నిద్రపోతున్నది. ఆ పిల్ల వేపు చూస్తుంటే ఆయనకు ఎన్నో సంగతులు జ్ఞప్తికిరా నారంభించాయి....

ఆరోజు తనింకా నిద్ర లేవలేదు. రంగన్న వచ్చి తలుపు తట్టాడు. పోయి చూస్తే, ఆశ్రమ ద్వారం దగ్గర ఒక పసి గుడ్డు పొత్తిళ్ళలో ఉంది. ఆ మసగ చీకట్లో, చుట్టు ప్రక్కల వెదికారు. ఎక్కడా ఎవరూ కనిపించలేదు. ఆ పసిగుడ్డు పొత్తిళ్ళలో చిన్న ఉత్తర మొకటి ఉంది దాన్ని చదువుతూనే, తను కూలి పోయాడు. తన హృదయం కారుణ్యంతో కరిగి పోయింది. ఎవరో అనాథట. అనివార్య పరిస్థితులలో ఈ బిడ్డను ఇక్కడ వదులుతున్నాననీ, రక్షించమనీ, ఆ తల్లి పదే పదే ప్రార్థించింది. ఆ ఉత్తరంలోని ప్రతి పంక్తిలోనూ, ఆ మాతృ హృదయం తనకు గోచరించింది. ఆనాటి నుండే తన ఆశ్రయాన్ని అనాథ శరణాలయంగా మార్చాడు. ఈ పద హారు సంవత్సరాలలోనూ, ఎంతో మందికి ఈ శరణాలయం ఆశ్రయ మిచ్చింది. బూది పాలుకావలసిన ఎన్నో జీవితాలను

పునరుద్ధరించింది. వారివైపు చూస్తుంటే తనకు కలిగే ఆనందం ఏ ఔన్నత్యంచేతా సాధింపరానిది !

కన్నవారికి దూరమై, వారి అనురాగానికి నోచుకోని వారందరికీ తనే తండ్రి అయ్యాడు. పితృ ప్రేమలోని మాధుర్యం తనకు అవగతమైంది. ఒక్కరొక్కరే దాటిపోతుంటే, తన మనస్సు ఎంతో బాధపడుతుండేది. వారిని విడిచి వుండలేక ప్రాణం గిలగిల లాడేది. కానీ ప్రపంచ ధర్మాన్ని తప్పడానికి వీలులేదుకదా....

రేపటితో శకుంతలగూడా వెళ్ళిపోతుంది. ఆ మాట జ్ఞప్తికొచ్చినప్పుడల్లా, తను దుఃఖాన్ని అణుచుకోలేక పోతున్నాడు. నిజానికి శకుంతల తన కన్న బిడ్డ కాదు - ఆ మాటకొస్తే ఇక్కడున్న వందమందిలోనూ ఎవరు తన బిడ్డలు ? కానీ, అందరిదారీ వేరు, శకుంతలదారి వేరు. తననీ మహోద్యమానికి పురిగొల్పింది శకుంతల; ఆనాడు - ఆశ్రమ ద్వారం దగ్గర - ఈమె పడి ఉండనట్లయితే, తనా అలౌకిక జగత్తులోనే కొట్టు మిట్టాడు తుండేవాడు. దానివల్ల - తనకు తానుగా ఏమన్నా ఫలితం పొందితే పొందుగాక; లోకానికి తనవల్ల, ఎలాంటి ఉపయోగమూ ఉండేది కాదు. అలాంటి 'ప్రమాదం' నుండి, తనను మరల్చి, లోకసేవవైపు దృష్టి సారించడానికి ముఖ్య కారణం శకుంతల. అందుకే ఆమె అంటే తనకెంతో అనురాగమూ, ఆపేక్షానూ !

తను 'అభిజ్ఞాన శాకుంతలం' చదువు తున్నప్పుడు, కాళి

దాసు ప్రతిభకూ, శిల్ప చాతుర్యానికీ మురిసిపోయాడుగానీ అందులో అభివర్ణితమైన మానవత్వాన్ని గుర్తించ లేకపోయాడు. కణ్వమహర్షి, ఆ శకుంతలను విడనాడటానికి పడిన బాధ, ఇప్పుడు తనకు అనుభవమవుతోంది! పెంచిన అనురాగమే తన నిలా విచలితం చేస్తున్నదే, నిజంగా కన్నవారి గుండెలు, ఆ క్షణాన ఎలా ఉంటాయో, తన కెలా తెలుస్తుంది!

శకుంతల తల్లి జీవించే ఉన్నదని తనకు తెలుసు. లేకపోతే ప్రతి ఉగాదికీ, ఆమెకు శుభాకాంక్షలు కానుకలు రావు. ఆ తల్లిని తెలుసుకొందుకు తనుచాలా ప్రయత్నాలు చేశాడు. కానీ, ఒక్కటీ ఫలించలేదు. విసుగెత్తి మానేశాడు. తలవని తలంపుగా నిన్న ప్రసాదు వచ్చాడు. అన్ని విషయాలూ దాచకుండా తనకు చెప్పాడు అతను.

రేపు శకుంతల తన అన్నగారితో వెళ్ళిపోతుంది. చాలా సంవత్సరాల తరవాతనైనా తన ఆప్తులను కలుసుకొన్నందుకు శకుంతల అదృష్టవంతురాలనే చెప్పాలి! కానీ ఆమె తన నుండి పోతున్నదనే బాధ మాత్రం — భరించరానిదే! —

* * *

తెల్లవారింది. ప్రయాణ సన్నాహాలన్నీ పూర్తి అయ్యాయి. ఆశ్రమంలోని వారంతా బండి చుట్టూ మూగారు. ఆనందస్వామి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. శకుంతల గూడా అంతకు తక్కువ స్థితిలో లేదు. బండి మనిషి

తొందర చేస్తున్నాడు. శకుంతల బండెక్కింది. ప్రసాదూ ఎక్కాడు. బండి సాగారింది. ఆనందస్వామి రెండు చేతులతోనూ ముఖం కప్పుకున్నాడు.

## 2

పచ్చని పొలాలమీది నుండి, చల్లటి గాలి వీస్తున్నది. రైలు కుదుపుతో ముందుకు దూసుకెడుతున్నది. శకుంతల పరుపు చుట్టకానుకొని నిద్రపోతున్నది. ప్రసాదు ఆమెకేసే చూస్తున్నాడు. అతని కళ్లు నీటితో నిండిపోయాయి. ఎవ్వరూ చూడకుండా వత్తుకొన్నాడు. తనకో చెల్లెలున్నదన్న సంగతి, మొన్న మొన్నటి దాకా తెలీదు. ప్రయోజకుడైన అన్నగా రుండిగూడా, ఆమె అనాధలాగా, ఆశ్రమంలో పెరగవలసి వచ్చింది. దీని కెవరు కారణమని తను తర్కించి ప్రయోజనం లేదు. అందరూ కారణమే!

గతించిందేదో గతించింది. దాన్ని గురించి ఇప్పుడు విచారించి లాభం లేదు. ఏది ఏమయినప్పటికీ ... తను ఈనాటికైనా తన చెల్లెలిని కలుసుకొన్నాడు. ఇంత సులభంగా పని నెరవేరుతుందని, తను అనుకోలేదు. తను చెప్పిన వాటి నన్నింటినీ స్వామి నమ్మారు. తన వెంట పంపించారు. దురదృష్టవశాత్తూ ఈ బిడ్డను చూచుకోడానికి అమ్మ బ్రతికి లేదు. ఉంటే ఎంత సంతోషించేదో!

తనకో చెల్లెలున్నదనీ, ఇంతకాలమూ ఆ చెల్లెలు, అనా

థాశ్రమంలో పెరిగిందనీ, అక్కకు తెలిస్తే — ఎంత బాధ పడుతుంది! ఎంత సంతోషిస్తుంది! తిరుగా తనీ ప్రాంతం రావడమనేది ఇంతలో సాధ్యపడదు. అదీగాక, శకుంతలకు తనవారినందరినీ పరిచయం చేయాలి. ఈ ఉద్దేశంతోనే శకుంతలకు తన అభిప్రాయాన్ని చెప్పాడు ప్రసాదు. శకుంతల గూడా అందు కంగీకరించింది.

* * *

వస్తుతః సుభద్ర మనస్తత్వం చాలా చిత్రమైంది. ఆమెకు, ఎదుటివారు నిజం చెబుతున్నారన్న నమ్మకం, అంతగా లేదు. అందుక్కారణం, ఆమెకు నిజంచెప్పే అలవాటు లేక పోవడమేనని, ఎవరన్నా అంటే సుభద్ర వొప్పుకోదు. ఎదుటివారు ఏదైతే చెపుతారో, దానికి విరుద్ధమైన ద్దాన్నే ఆమె భావిస్తుంది. ఎదుటివారు అన్నం తినలేదని చెబితే, సుభద్ర వాళ్ళు తిన్నారని చప్పున నిర్ణయం చేస్తుంది! ఆమె కదో జబ్బు.

అటువంటిదే ఈనాడూ జరిగింది.

ప్రసాదును చూస్తూనే ఆమె ముఖం విప్పారింది. శకుంతలను చూస్తూనే ముడుచుకు పోయింది. తన తమ్ముడు, శకుంతల పట్ల ప్రవర్తించే విధానం ఆమె కెంతమాత్రం నచ్చలేదు. ఇంతకాలం వాడికిలాంటి జులాయి వేషాలు లేవనుకొంది సుభద్ర. శకుంతలను చూడంగానే, ఆ భ్రమ కాస్తా విచ్చిపోయింది. ఇలాంటివాడు తన బిడ్డనేం చేసుకొంటాడు?

చేసుకొన్నా ఏం సుఖపెడతాడు? పైగా పాప పుణ్యాలు గూడా విచారించకుండా ఆ పిల్లను "చెల్లీ" అంటున్నాడు! ఇలా అని లోకం కళ్ళు గప్పాలని వాడి అభిప్రాయం కావచ్చు కానీ తను దాన్ని నమ్మదు.

గోపాలం భార్యను చాటుకు పిలిచి, ఆ పిల్ల ఏవరని అడిగాడు. సుభద్ర జవాబు చెప్పలేదు. ఏమని చెబుతుంది? తన తమ్ముడు లేపుకొచ్చిన మనిషని చెబుతుందా? ఆ మాట విన్న తరవాత ఆయన గడియసేపు వాణ్ని ఇంట్లో ఉండనిస్తాడా? మళ్ళీ ఈ గడప తొక్కనిస్తాడా? ఎవత్తో గుడిసేటి దాని కోసం, తమ్ముడు భవిష్యత్తంతా నాశనం చేయడం సుభద్ర కిష్టం లేదు. అందుకే - భర్తకు ఏదో సర్ది చెప్పింది. ఆయనగా రేదో గొణుక్కున్నాడు.

ఇదింతటితో పోదని సుభద్ర నమ్మకం! ఇప్పుడే వాణ్ని తగిన కట్టుదిట్టాల్లో పెట్టకపోతే, మరో నాలుగు రోజులకు చేతికి అక్కరకు రాకుండా పోతాడు. ఒక్కగాను ఒక్క తమ్ముడు! వాడిలా, ఎందునా కాకుండా మట్టిగొట్టుకు పోతుంటే సుభద్ర చూస్తూ ఊరుకోలేదు.

తమ్ముడికి నయానా భయానా చెప్పి చూసింది. వాడి మనస్సును శకుంతల మీదినుండి తిప్పడానికి, శక్తివంచన లేకుం డా పాటుపడింది! శకుంతల ఏమరులమందు పెట్టిందోగాని, ప్రసాదు, తన మాటను వినిపించుకోనే లేదు. అంటే - ఇప్పటికే బాగా వేళ్ళు పాతుకొన్నా యన్నమాట!

దీనికి తోడు గోపాలం పోరు ఎక్కువయింది. అతను సుభద్రను గుచ్చి గుచ్చి అడుగుతున్నాడు. ఇలాంటి వెధవ్వేషాలు తనింట్లో సాగడానికి వీల్లేదన్నాడు. బంధుత్వముంటే, బంధుత్వంలాగే ఉండాలిగాని, తన కొంప, సాని కొంపగా మార్చరాదన్నాడు. అంతగా ప్రేమ కొట్టుకు పోతుంటే ... ఇంకెక్కడన్నా అఘోరించక, తన కొంపలోకి చేరడమెందుకన్నాడు.

సుభద్ర వీటి కేమీ అనలేదు. నిజాని కీమాటలు సుభద్ర నన్నవికాదు; ప్రసాదుకు సంబంధించినవి. అంచేతే ఆమె ఎటూ మాట్లాడకుండా ఊరుకొంది. సమాధానం చెప్పవలసిన ప్రసాదు మౌనంగా ఉండిపోయాడు. ఈ మాటలు ఎంత తీవ్రంగా పని చెయ్యాలో, అంతగానూ చేశాయి. శకుంతల స్థితి దారుణంగా ఉంది.

రైల్లో వస్తున్నప్పుడు, అన్నయ్య – అదే - ప్రసాదు - అక్కను చూడడానికి దిగుదా మన్నప్పుడు, శకుంతల సంబరపడ్డది. ఆమె మనస్సు ఆనందంతో నిండిపోయింది. ఇటీవలిదాకా, తనకు దిక్కూ మొక్కూ లేదనుకుంది శకుంతల. తల్లి ప్రేమకు, తండ్రి అనురాగానికీ నోచుకోని, నిర్భాగ్యురాలననుకొంది. తన కీ జన్మలో ఆ అదృష్టం లేదని, ఎన్నోసార్లు కుమిలి కుమిలి ఏడ్చింది! తన ఏడుపు వినే దెవరు? విని ఓదార్చే దెవరు? అక్కడ ఉన్నవారంతా, తనలాంటివారే కావడంతో, ఒకరి నొకరు ఓదార్చుకో వలసి వచ్చేది.

ప్రసాదు వచ్చేదాకా, తనకో అన్నగారున్నారని తెలియదు. తెలిసిన తరువాత తను పొందిన ఆనందం అనంతమైనది. ప్రపంచాధిపత్యం లభించినా, తన కలాంటి హాయి, తృప్తి, కలిగేవి కాదు. 'నా' అనే దిక్కులేని తనకు; ఓ బంధువు — బంధువే కాదు - తోబుట్టువు లభించాడు. అంతకన్నా తనకు కావలసిందేమీ లేదనుకొన్నది! ఇంతకాలమూ పొడారిపోయిన తన హృదయంలో, ఏవో అమృతపు సోనలు వర్షించినట్లయింది.

తనీ ఆనందానికే తబ్బిబ్బయి పోతుంటే, ప్రసాదు; తనకో అక్క గూడా ఉందన్నాడు. కొన్ని క్షణాలు తనను తనే నమ్మలేక పోయింది. ఇదంతా స్వప్న మేమోననీ, మెలకువ రాగానే ఈ కల కరిగిపోతుందేమోననీ, తను భయపడింది! అన్నగారు దొరికినందుకే, ఆనంద భరితురాలైన తను, అక్కగారు గూడా ఉన్నారని విని మహదానందంలో మునిగిపోయింది. ఆ ఆనందోద్వేగానికి, తను తట్టుకోలేక పోయింది...

ఎంతో ఆప్యాయంగా, సంవత్సరాల తరబడి, తనలో నిద్రిస్తూన్న, అనురాగాన్నంతా జాగరితం చేసుకొని, ఉద్వేగంతో, తడబడుతున్న అడుగులతో, అక్కను ఆలింగనం చేసుకోబోయింది; అక్కను చూడ గలిగినందుకు తనెంత సంబర పడ్డదో, తనను చూడగలిగినందుకు, అక్కగూడా అంతే సంబర పడుతూ ఉంటుందని - తను అనుకొన్నది ... కానీ తనను చూస్తూనే అక్కయ్య, ముఖం గంటు పెట్టుకొంది.

ప్రసాదును ఎంతో ఆప్యాయంగా పలుకరించిన అక్కయ్య, తన వైపొక 'విషపుచూపు' చూసి, గిరుక్కున లోపలి కెళ్ళిపోయింది. తను అన్న వేపు చూసింది. అన్న అదోలా ఉన్నాడు! తన మనస్సు తీవ్రంగా గాయపడ్డది. అమూల్యమయిన దేమిటో కోల్పోతున్నట్టుగా, తన మనస్సు గిజగిజ లాడింది.

— కారణం చూచాయగా తెలియ వచ్చింది! తను చాలా పొరబాట్లు చేసినట్లు ఆలస్యంగా గ్రహించింది. లోకంలో, ఇలాంటి మోసకారులూ, దగాకోరులూ, లుచ్ఛాలూ ఉంటారని, తనకు తెలీదు. తెలిస్తే, తను ప్రసాదు వెంట రాదు. తను సరేసరి - స్వామివారు గూడా, ఈ వలలో చిక్కుకున్నారు. వీడి మాటలు విని, వీడు నిజంగా తనకు అన్నగారేనని నమ్మి, తనను వీడివెంట పంపించారు. ఎన్నో ఆశలతో, స్వప్నాలతో, ఆనందాలతో, తను ప్రసాదు వెంట వచ్చింది! అవన్నీ నామరూపాలు లేకుండా పోవడానికి, ఎక్కువసేపు పట్టలేదు ...

ఈ అక్కగారి మాటలను బట్టే, ప్రసాదు తన నెందుకు తీసుకొచ్చిందీ తెలిసి పోయింది. ఇప్పుడు తనేమిటి చెయ్యడం?

శకుంతల కేమీ తోచలేదు. రెండు చేతులతోనూ ముఖాన్ని కప్పుకొని బావురుమని ఏడ్చింది.

'ఎందుకు చెల్లీ ఏడుస్తున్నావ్?' అన్నాడు ప్రసాదు దగ్గరికివచ్చి.

శకుంతల మాట్లాడ లేదు. ఏడుపు మాననూ లేదు.

అతనికి దూరంగా మాత్రం జరిగింది.

'ఊరుకో చెల్లీ! అక్కయ్య బావ గూడా నన్నింకా అర్థంచేసుకో లేదు. అందుకే, వారలా అపోహ పడారు. తెలిసీ తెలియక, ఏదో అన్నారు! అందుకోసం నువ్విలా మనస్సు కష్ట పెట్టుకోవడం బాగా లేదమ్మా! నా మాట విను - నువ్వేమీ అనుకోకు. పెద్దవారు - మననోమాట అనదగ్గవారు - అక్క కోప్పడితే, చెల్లెలు ఇలా ఏడవడం బావుంటుందా?' అన్నాడు ప్రసాదు, ఉబుకుతున్న కన్నీటిని ఆపుకొంటూ.

'మీరేమీ మాట్లాడకండి! నాకన్నీ తెలుసు మీరిలాంటి నీచులని తెలిస్తే, స్వామివారు, మీతో పంపి ఉండరు. ఎన్నో కల్లబొల్లి మాటలను చెప్పారు. కళ్ళంట నీళ్ళుగూడా పెట్టుకొన్నారు. మీ నటనను చూసి, అందరూ నిజమే ననుకొన్నారు... నన్నిలా ఎందుకు నాశనం చేస్తారు? నేను చేసిన అపరాధ మేమిటి?... ప్రసాదుగారూ! తల్లిదండ్రీ లేని దాన్ని, ఏ దిక్కూ లేని అనాథను, నన్నిలా మోసగించడం ధర్మంకాదు! మీకూ తోబుట్టు వున్నది. ఆమె నెవరైనా, ఇలా నమ్మించి మోసగిస్తే, మీ హృదయం ఎలా ఉంటుంది? నా కెవ్వరూ లేరనేగదా, ఇలా సాహసించారు!... మీరింకేమీ మాట్లాడకండి! నాకంతా తెలుసు. నా దోవన నన్ను పోనీండి!' అన్నది శకుంతల.

ప్రసాద్ కొన్ని నిమిషాలు ఏమీ మాట్లాడ లేదు. ఉన్నట్టుండి అతని ముఖం కందిపోయింది. కన్నులు నిప్పుగోళాల్లా

ఎర్రబడాయి. మనిషి నిలువునా వణికిపోతున్నాడు. గిరుక్కున తిరిగి చకచకా అక్క గదివైపు నడిచాడు.

'అంతా విన్నాను!' అన్నది సుభద్ర. 'ఏం దూకుడుగా వచ్చావ్! కొడదామనా? పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు. తమ్ముడివిగదా అనీ, నా అంత వాడివిగదా అనీ, మాటల్తో పోనిస్తున్నాను. నా కంఠంలో ఊపిరుండగా నిన్నా శకుంతలతో ఉండనివ్వను!... పైగా నువ్వేదో మోసం చేశావంటుందేమిటా భడవ? మోసగించింది అదే! బంగారం లాంటి కుర్రవాడికి మతివిరిచి వాజమ్మను చేసి కూచోబెట్టింది. ఇంకో రెండు రోజులు పోతే, నిన్నె అయిపులేకుండా చేసినా చేస్తుంది. ఎంత టక్కులాడి కాకపోతే, నిన్నిలా కీలుబొమ్మను చేసి ఆడిస్తుందీ? గంగిగోవు లాంటి వాడివి - ఎన్నడూ గట్టిగా మాట్లాడిన వాడివిగూడా కాదు; అలాంటి వాడివి. మింగేయడాని కన్నట్లు, మీదికొస్తున్నావంటే - అదెంత విషంపోసి ఉండాలి!!'

'అక్కా!' అని బిగ్గరగా అరిచాడు ప్రసాదు

'అప్పుడే పిచ్చి లక్షణాలు గూడా ఏర్పడ్డాయి ...' అన్నది సుభద్ర.

'అయ్యో! నీ కెలా చెప్ప నక్కాయ్! మీ రెవ్వరూ నన్ను అర్థం చేసుకోవడం లేదు. మీ మూర్ఖత్వంవల్ల శకుంతల బాధపడుతోంది! తను తిరిగి ఆశ్రమానికి వెడుతా నంటోంది.'

'లక్షణంగా పొమ్మను. అసలు నేనే వెళ్ళగొడదా మను

కొంటున్నాను ... దానంతటదే పోతానంటే సంతోషించక ఏడుస్తావెందుకురా ? మహారాజుగా వెళ్ళమను. కావలిస్తే ఇప్పుడే వెళ్ళి స్టేషన్‌లో కూచోమను !' అన్నది సుభద్ర.

'ప్చ్' అని చప్పరించాడు ప్రసాదు.

'లాభం లేదు. ఈ రహస్యం నీకు చెప్పకుండా ఉందామనే అనుకొన్నాను. చెప్పి నీ మనస్సును బాధ పెట్టగూడదనుకొన్నాను. కానీ, మీరు నన్నలా ఉండనివ్వడం లేదు...' అన్నాడు ప్రసాదు.

సుభద్ర ఆశ్చర్యంగా తమ్ముడు కేసి చూసింది.

ప్రసాదు ఓ నిమిషం నేలకేసి చూసి, ఛటుక్కున తలెత్తి అక్క కళ్ళల్లోకి చూస్తూ, ఆమె రెండు చేతులూ పట్టుకొని, 'అక్కాయ్ ! ఈ సంగతులన్నీ నీతో చెప్పవలసి వచ్చినందుకు బాధ పడుతున్నాను ... ! ముందో మాట నాకివ్వాలి ... అమ్మను – క్షమించ గలవా అక్కా ?' అన్నాడు ప్రసాదు !

సుభద్ర వెర్రిదానిలా తమ్ముడికేసి చూసింది. మాట రాక, 'క్షమించగల' నన్నట్టు తల పంకించింది.

ప్రసాదు ఒక్కసారి నిట్టూర్చి, గొంతు సరిచేసుకొన్నాడు.

'ముందుగా అమ్మకు మామూలు జ్వరమే వచ్చింది. క్రమంగా అది టైఫాయిడ్‌గా మారింది. అప్పుడే నేను మీకు

టెలిగ్రాం యిచ్చాను. మీరు, మరో రెండు రోజులకు వస్తా రనగా, ఈ సంఘటన జరిగింది. ఒక రోజున ...

*　　　*　　　*

పార్వతమ్మ మంచంలో అటూ ఇటూ కొట్టుకు లాడు తోంది. డాక్టరు గూడా చాలా ప్రమాదమనీ, గండం గడవ డం కష్టమనీ చెప్పాడు. అయినా మానవ ప్రయత్నం చేదా మన్నాడు. ప్రసాదుకు కాలూ చెయ్యీ ఆడడం లేదు. ఒంటరి గాడు. అంతకు క్రితం, ఇలాంటివి అనుభవం లేనివాడు. మరీ రెండు రోజుల నుండీ, పరిస్థితి మరింతగా విషమించింది.

డాక్టరును పంపి వచ్చేసరికి తల్లి కుమిలి ఏడుస్తున్నది.

'ఎందుకమ్మా ఏడుస్తావ్ ?' అన్నాడు ప్రసాదు.

అన్నాడేగాని అతనికీ దుఃఖం పుక్కిలింత లవుతోంది.

పార్వతమ్మ కొంచెంసేపు ఏమీ మాట్లాడ లేదు. తరు వాత, కొడుకు రెండు చేతులూ పుచ్చుకొని, 'నాయనా ! తల్లిని, మహా పాపిని ! ఇంత కాలమూ ఈ రహస్యం నీకు తెలియకుండా దాచాను. ఇంకా దాచి ప్రయోజనం లేదు.' అన్నది.

'ఏమిటమ్మా ఆ రహస్యం ?' అన్నాడు కొడుకు.

'నన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తావా నాయనా ?'

'ఏం మాటలమ్మా అవి ? నేను నిన్ను మన్నించడ మేమిటి ?'

పార్వతమ్మ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి ...

అంతే! అంతకుదప్ప ఆమె ఏమీ మాట్లాడ లేదు. ప్రసాదు గూడా మాట్లాడించాలని ప్రయత్నించ లేదు. ఆ మధ్యాహ్నమే ఆమె చనిపోయింది. మృత్యువంటే ఏమిటో, అదెంత నిశ్శబ్దంగా ప్రాణాన్ని హరించివేస్తుందో, ప్రసాదు మొట్టమొదటిసారి గమనించాడు ...

కర్మకాండలన్నీ పూర్తయ్యాయి. బంధువు లందరూ ఒకరొకరే వెళ్ళిపోయారు. అమ్మ తాలూకు చర్యలను జ్ఞాపకం చేసుకొంటూ, ప్రసాదు కుమిలి పోతున్నాడు. ఆమె ప్రాణ ప్రదంగా దాచుకొనే, దేవతార్చన పెట్టె తీసినప్పుడు, అందులో ఓ కాయితం కనిపించిం దతనికి. ఏమిటోనని, తీసి చదివాడు.

'నాయనా!

'మీ నాన్న చనిపొయ్యే నాటికి, నువ్వూ, అక్కయ్యా, చిన్న పిల్లలు; ఈ సంసారాన్ని నేనొక్కదాన్నే ఈదుకు రావాలి సొచ్చింది. నీ చిన్నతనంలో, మన ఊళ్ళో సోమసుంద రం గార నే ఆయన ఉండేవాడు. మన వ్యవహారాలన్నీ ఆయన గారే చూస్తుండే వాడు. ఆయన ఆదుకోక పోయినట్లయితే, ఈ ఆస్థి మనచేతికి చిక్కేదికాదు. పిల్లలకు లేకుండా పోతుందనే అభిప్రాయంతోనే, ఆయన చెప్పినట్లల్లా చేశాను. ఆయనకు లొంగిపోయాను. నాయనా! ఈ విషయాలన్నీ నీకు చెప్ప డం ఎట్లాగా అని, నాలో నేను చాలా కాలం మధన పడ్డాను. ఇంత కాలం, ఈ రహస్యం, జాగ్రత్తగా కాపాడుతూ వచ్చాను. నా మరణానంతరమే, ఈ ఉత్తరం నీ చేతికి చిక్కుతుంది

గనుక, అప్పుడు నువ్వు దూషించినా, భూషించినా, నాకు తెలియదనే నమ్మకంతోనే, ఇలా రాస్తున్నాను.

'సోమసుందరం గారి సాహచర్యం వల్ల, తిరిగి నేను తల్లి నయ్యాను. ఆయన దాన్ని మాపుచేయాలని చాలా ప్రయత్నించాడు. నేనే అంగీకరించ లేదు. గ్రామంలో గుస గుసలు రేగాయి. అందరూ మనల్ని వెలివేశారు. వీధిలోకొస్తే, కాకుల్లా పొడిచి చంపుతున్నారు. అక్కడ ఉండడం అసంభవమయి పోయింది.

'అందుకే ఉన్న ఆస్తినంతా అమ్ముకొని, ఈ దూరదేశం రావడం జరిగింది. మీనాన్న మరణానంతరం పుట్టిన ఈ బిడ్డను పంచేయాలో నాకు తోచలేదు. విడిచి పెట్టడానికి చేతులు రాలేదు. చాలా రోజులు, అలానే ఆలోచిస్తూ ఉండి పోయాను! బిడ్డ రోజు రోజుకూ పపుగా ఎదుగుతున్నది. ఇద్దరు బిడ్డలను పెంచిన ఈ చేతులతో, నా మూడవ బిడ్డను చంపలేక పోయాను. అమాయికంగా నవ్వుతూ, బుల్లి బుల్లి చేతుల్ని, కాళ్ళను, గాలిలో ఆడిస్తూ, నన్ను చూపినప్పుడల్లా కేరింతాలాడే ఆ పసిపాపను, వదలలేక నాలో నేను కుమిలి పొయ్యాను. రాత్రింబవళ్ళు, ఆ పసిదాన్ని తలుచుకొని, పరితపించాను...

'కానీ తప్పనిసరైంది! లోకం ఘోరరాక్షసిలాగా నన్ను కనిపెట్టి ఉంది! అదీగాక, నువ్వూ నీ అక్కా పెరుగుతున్నారు. మీరు పెద్దవాళ్ళైయాక, ఈ సంగతి తెలిస్తే, ఎంత

బాధపడతారో ననీ, మీ భవిష్యత్తు ఎలా మారుతుందో ననీ, నాకు భయ మేసింది! అందుకే, నా మాతృహృదయాన్ని చంపుకున్నాను. నా పెద్దపిల్లల క్షేమం కోసం, నా మూడవ పిల్లను అనాథను చేశాను. రాక్షసిలాగా ప్రవర్తించాను ..... ఎవరో ఆనందస్వామి పేరు నాకు చెప్పారు. ఒకనాటి తెల్లవారుఝామున, ఆ బిడ్డను, ఆశ్రమందగ్గర విడిచి వచ్చాను.

'ఇప్పుడు నీ చెల్లెలు ఆ ఆశ్రమంలోనే ఉంది. ఆమెకు ప్రతి సంవత్సరం నేను ఏవో కానుకలు పంపుతూనే ఉన్నాను. కానీ ఈ ఏడు నేను పంపలేక పోయాను. నా బిడ్డను కడసారి చూద్దామన్న ప్రయత్నం గూడా నెరవేరలేదు .... ఈ జీవితంలో అది సాధ్యపడదని నాకు తెలుసు. కన్నబిడ్డను, చేతులారా పెంచుకొనే భాగ్యం నాకు లేకపోయింది. లోకానికి జడిసి నా బిడ్డను అనాథను చేశాను..., ఇప్పుడు నీ చెల్లెలి బాధ్యతను నీ కప్పగిస్తున్నాను. ఆమెను పాల ముంచుతావో, నీట ముంచుతావో, నీదే భారం! నేను చాలా తప్పులు చేశాను. అయినా నన్ను క్షమించు —

— అమ్మ'

ఉత్తరం చదవడం పూర్తయింది. ప్రసాద్ వణికిపోయాడు. చెప్పలేనంత ఆవేశం వచ్చింది. "అమ్మా!" అని బిగ్గరగా కేక వేశాడు. ఆ కేకకు గది గోడలు ప్రతిధ్వనించాయి.

*　　*　　*

'అక్కయ్యా! ఆ మరునాడే నేను ప్రయాణమయ్యాను. ఆనందస్వామి వారికి, ఆ ఉత్తరం చూపించాను. ఆయన, శకుంతలను నా వెంట పంపారు. చాలా సంవత్సరాల తరవాత, మనకు దొరికిన చెల్లిని నీకు చూపెడదామనీ, ఈ ఆనందంలో, నువ్వు భాగం పంచుకొంటావనీ, నేను శకుంతలను, ఇక్కడకు తీసుకొచ్చాను. నువ్వు నన్ను మరోలా అర్థం చేసుకొన్నావ్ .... అక్కా! అమ్మ, తను చేసిం దేమిటో మనకు చెప్పింది. ఆమె నిప్పుడు దూషించడం మంచిది కాదు. తన బిడ్డలే తనను దుయ్యబట్టడాన్ని, ఏ తల్లి హృదయమూ సహించలేదు. అమ్మ చేసింది చెడ్డపనే అయినా, నువ్వు అమ్మను క్షమించాలి అక్కా! లేకపోతే, ఆమె ఆత్మ క్షోభించి పోతుంది.' అన్నాడు ప్రసాదు గద్గద స్వరంతో.

సుభద్రకు పిచ్చిచూపులు పడ్డాయి!

'అమ్మ మంచిది! చాలా మంచిది! తమ్ముడూ! అమ్మ చాలా మంచిది!' అన్నది సుభద్ర, తమ్ముడి భుజంమీద తల ఆన్చి వెక్కి వెక్కి పడుతో. 'ఎంత మంచిది గాకపోతే, నేను చేసిన తప్పును, తనమీద వేసుకొంటుంది అమ్మ! .... అమ్మా! నువ్వు మంచిదానివి! చాలా మంచిదానివి!!' అని భోరుమని ఏడ్చింది సుభద్ర.